జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


బుధవారం | 22-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 652 పేజీలు: 4 వెల: రూ.7



# బాబు చెప్పిందే.. రేటు!

* అతని కనుసన్నల్లోనే మద్యం సిండికేట్
* పలాస నియోజకవర్గంలో ఆ ఒక్కడి చేతిలోనే 25 షాపులు
* బెల్టులకు మద్యం తరలించేది టీడీపీ నేత అనుచరులే
* మద్యం సామ్రాజ్యంలో మకుటం లేని మహరాజు
* సీసాకు అదనంగా రూ.10లు వసూళ్లు
* పలు షాపుల్లో కల్తీ మద్యం
* మామూళ్ల మత్తులో కొందరు ఎక్సైజ్ అధికారులు

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 21 (వార్త):** పలాస నియోజకవర్గంలో ఆ ఒక్కడి చేతిలోనే 25 మద్యం షాపులు ఉన్నాయి. అతని కనుసన్నల్లోనే మద్యం వ్యాపారులు మెసులుతుంటారు. ఆయన చెప్పిందే రేటు. మద్యం రేటు పెంచాలన్నా, బెల్టుషాపులకు ఏయే షాపుల నుంచి ఎంతెంత మద్యం తరలించాలి.. ఎవరెవరికి వాటాలు ఎంతెంత ఇవ్వాలి.. ఇలా అంతా ఆయనే ఫిక్స్ చేస్తాడు. సిండికేట్ అంతా ఆయన చేతుల్లోనే ఉంటుంది. ఎవరైనా అడ్డుతగిలితే.. షాపు వదులుకోవాల్సిందే. పేరుకే వ్యాపారులది. నడిపేదంతా ఈ బాబు గారే. అధికార దర్పం, అనుచరుల అండదండలు ఉండడంతో.. పలాస నియోజకవర్గంలో మద్యం సామ్రాజ్యంలో ఆయన ఓ మకుటం లేని మహరాజు. ఆయనకు ప్రభుత్వ నిబంధనలతో పనేలేదు. నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలంటూ ప్రభుత్వం ఎన్ని నిబంధనలు అమలుచేస్తున్నా.. బాబు చెప్పిందే అక్కడ వేదం. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నా.. ఈ బెల్టు షాపులకు ఓ వ్యాన్ పెట్టి మరీ మద్యం తరలిస్తుంటాడు. పలాస నియోజకవర్గంలో సుమారు 25 వరకూ మద్యం షాపులు, బార్లు ఉన్నాయి. అవన్నీ కూడా బాబు ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. వేలం పాటలో దక్కించుకున్న వారిని భయపెట్టి మరీ తన ఆధీనంలోకి తెచ్చుకుని మద్యం వ్యాపారమంతా ఆయనే నడిపిస్తున్నాడు. అనుచరుల ద్వారా మద్యం దందా వెనుకుండి చేయిస్తున్నాడు. నియోజకవర్గంలోని ఏ మూల బెల్టుషాపు పెట్టాలన్నా.. ఈ బాబునే సంప్రదించాలి. ఆయన కనుసన్నల్లోనే మద్యం షాపులతో పాటు బెల్టుషాపులు సైతం కొనసాగుతున్నాయంటే ఈ దందా ఏ మేరకు సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. నెలవారీ పోలీసు, ఎక్సైజ్ శాఖలకు మామూళ్లు వెళుతుండడంతో వారంతా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారన్న విమర్శలు బహిరంగంగానే ఉన్నాయి. ఈ బాబు చేస్తున్న మద్యం సిండికేట్ వ్యాపారంలో టీడీపీ నేతలకు ఎవరెవరికి ఎంతెంత వాటా ఉందన్న దానిపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు పలుమార్లు బహిరంగ విమర్శలు కూడా చేశారు. మా ప్రభుత్వం.. అంతా మా ఇష్టం.. మమ్మల్ని ఎవడ్రా ఆపేది అనే ధోరణిలో ఈ బాబు ఉండడం, ఆయనకు వత్తాసుగా అధికార పార్టీ నేతలు ఉండడంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు కూడా మౌన మునిలా వ్యవహరిస్తున్నారన్న గుసగుసలు పలాస నియోజకవర్గంలో వినిపిస్తోంది.






(పలాసలోని ఎక్సైజ్ కార్యాలయం అధికారుల తీరు, సోంపేట ఎక్సైజ్ పరిధిలో కల్తీ మద్యంపై.. 'జాతీయ వార్త'లో త్వరలో సమగ్ర కథనం)



# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

* పీఆర్‌టీయూ నాయకులు
* జిల్లా కేంద్రంలో శాంతియుత ధర్నా
* కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21 (వార్త):** ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాంతియుత ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని, నూతన పీఆర్‌సీ కమిటీ వేసి 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ మంజూరు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ వర్తింపజేయాలన్నారు. పెండింగ్ డీఏ, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రిటైర్ అయిన రోజే ఇవ్వాలని, విశ్రాంత ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. 302 జీవో పునరుద్ధరించి జేఎల్ పదోన్నతులు కల్పించాలని, ఎస్ఏ తెలుగు/హిందీ ప్రమోషన్లలో ఎస్‌జీటీలకు 70శాతం,డైరెక్ట్ రిక్రూట్మెంట్ వారికి 30 శాతం అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు ఏర్పాటు చేయాలని, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలను గ్రేడ్-1 హెచ్ఎంలుగా మార్చాలన్నారు. ఉర్దూ, ఒరియా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఆ బడులను బలోపేతం చేయాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించాలని, ప్రతి ఉన్నత పాఠశాల/మోడల్ ప్రైమరీకి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయ రేషనలైజేషన్ 5 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే చేపట్టాలన్నారు. జడ్పీ పరిధిలోని ఉపాధ్యాయుల కారుణ్య నియామకాలు కలెక్టర్ పరిధిలో చేపట్టాలని, ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష రద్దు చేయాలన్నారు. కేజీబీవీ, గురుకుల, ఎస్ఎస్ఏ, ఐటీడీఏ, మోడల్ స్కూల్స్, గురుకులాలను ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. కేజీబీవీలో నైట్ డ్యూటీ సిబ్బందికి ఉదయం పూట 2 గంటలు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఎస్ఎస్ఏలోని ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, పీఈటీలను ఫుల్ టైం చేయాలన్నారు. ఇన్-సర్వీస్ వ్యాయామ ఉపాధ్యాయులకు బీపీఈడీ, ఎంపీఈడీ చేసే అవకాశం కల్పించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉండే అన్ని జీవోలను వర్తింపజేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులందరికీ ఇన్సూరెన్స్‌తో కూడిన ఈహెచ్ఎస్ విధానము అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ శాంతియుత ధర్నాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు, జిల్లా అధ్యక్షులు తంగి మురళీమోహనరావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పప్పల రాజశేఖర్, రాష్ట్ర సహాధ్యక్షులు కరణం సీతరాజు, బత్తుల రవికుమార్, శరత్ బాబు, గౌరవ అధ్యక్షులు జి.బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.









## వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21(వార్త):** ఉమ్మడి జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాసంచాలకుల ఆదేశాల మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వారి వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. త్వరలో జరగబోవు బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలన్నీ ఈ సాధారణ జాబితాను అనుసరించి చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి వెబ్ సైట్ లింక్ (https://www.sites.google.com/site/deosklorg) లో ఉన్న సాధారణ సీనియారిటీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 తేదీన ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 5 గంటలులోగా జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయమునకు తగిన ధ్రువీకరణ పత్రాలు ఆధారాలతో సమర్పించాలన్నారు.

## పేరాడ తిలక్‌కు మరోసారి నోటీసులు

**టెక్కలి, ఏప్రిల్ 21 (వార్త):** టెక్కలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక్‌కి టెక్కలి ఎస్సై రాము పేరాడ తిలక్‌కు నోటీసులు అందజేశారు. విచారణకు రావాల్సివుంటుందని తెలిపారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాజీవ్‌నగర్‌లో గోమాంసం విక్రయాలపై వివాదం.. పోలీసుల తనిఖీ

**నరసన్నపేట, ఏప్రిల్ 21 (వార్త):** నరసన్నపేటలోని రాజీవ్‌నగర్ కాలనీలో గోమాంసం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందిందని విశ్వహిందూ పరిషత్, లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.

ఈ అంశంపై మంగళవారం వారు ఆందోళన వ్యక్తం చేస్తూ సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయనగరం ప్రాంతం నుంచి గోమాంసాన్ని తీసుకువచ్చి కిలో రూ.250 చొప్పున విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన నరసన్నపేట ఎస్సై గణేష్ ఘటనాస్థలానికి చేరుకుని తనిఖీ నిర్వహించారు. స్థానికంగా రెండు కేంద్రాల్లో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు.

విశ్వహిందూ పరిషత్ సభ్యుల నుంచి పూర్తి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. కేసు ఫైల్ చెసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేష్ తెలిపారు.



## జనగణనను విజయవంతం చేయాలి



**జి.సిగడాం, ఏప్రిల్ 21(వార్త):** దేశ ప్రగతికి అవసరమయ్యే జనగణన ప్రక్రియలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఇంటి సమాచారాన్ని ఖచ్చితత్వంతో సేకరించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, తహాశ్ధార్ ఎం. సరిత పిలుపునిచ్చారు..కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సెన్స స్-2027'లో భాగంగా మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జనగణన 3 వ బ్యాచ్ లకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ప్రతీ బ్యాచ్ మూడు రోజుల పాటు అరుగురు నిష్ణాతులైన శిక్ష కులచే శిక్షణ నిర్వహిస్తున్నామని ఇప్పటికే రెండు బ్యాచ్లకు శిక్షణ నిర్వహించామన్నారు., క్షేత్రస్థాయిలో తలెత్తే సందేహాలను ఇక్కడే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమాజంలోని ప్రతి వ్యక్తి స్థితిగ తులను ప్రతిబింబించే ఈ డేటా సేకరణలో ఎటు వంటి పొరపాట్లకు తావుండకూడదని, సిబ్బంది క్రమశిక్షణతో ఈ జాతీయ విధిని పూర్తి చేయాలని ఆదేశించారు

## ఎంపీ నిధులతో తాగునీటి బోరు



**జి.సిగడాం, ఏప్రిల్ 21(వార్త):** పెంట గ్రామంలో ఎంపీ నిదులతో తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్లు నీటి యాజమాన్య సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ తెలిపారు.మంగళవారం గోపాలమ్మ వీదిలో బోరు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ ఏన్నో ఏళ్ల నుంచి తాగునీటి ఎద్దడి ఎదుర్కోంటున్న దృష్యా గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఇటీవల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లామని దీనికి స్పందించిన ఆయన ఎంపీ ల్యాడ్ నిదులను మంజూరు చేసారన్నారు. గత ఆదివారం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో బోరుకు హెడ్ వేయించి తాగునీరు అందించాలని ఇచ్చిన వినతిని పరిశీలించిన పెదప రెండు రోజులలో తాగునీరు అందించారని తెలిపారు. ఎంపీకి గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల రమణ, మక్క గోవిందరావు, డోల అప్పన్న, మక్క నారాయణరావు, మీసాల రామినాయుడు, మక్క సూరిబాబు, మక్క రమణ తదితరులు

## ప్రభుత్వ బడి భవిష్యత్‌కు పునాది



**జి.సిగడాం, ఏప్రిల్ 21 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్ నకు పునాదులని ఎంఈఒ అరసాడ రవికుమార్, ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎస్పీ ఆర్ పురం గ్రామంలో బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్కారు బడులలో నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందన్నారు. పాఠశాలలో మౌళిక వసతుల కల్పనతో పాటు ఉచితంగా పుస్తకాలు అందిస్తుందన్నారు. తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులచే నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంది రమాదేవి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

**పలాస, ఏప్రిల్ 21 (వార్త):** అంగన్వాడి పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఐసిడిఎస్ పివో కే పార్వతి అన్నారు. బొడ్డపాడు ఏడబీసీలో టెక్కలిపట్నం సెక్టార్ అంగన్వాడి కేంద్రంలో 8వ "పోషణ పక్వాడ్ కార్యక్రమం"ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు, బాలింతలు, చిన్నారుల పోషణ, ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన కలిగించడానికి నిర్వహిస్తున్న ప్రభుత్వ జాతీయ సమావేశం-పక్వాడ (పోషణ వారం) ప్రచార కార్యక్రమమని తెలిపారు. చిన్నారులకు పాఠశాల వాతావరణం అలవాటు చేసేందుకు, భాషా ప్రవీణ్యం సాధించేందుకు, అంగన్వాడి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేదిగా కృషి చేయాలని కోరారు. బొడ్డపాడు సెక్టార్ నుంచి ఐదు విద్యార్థులు, టెక్కలపట్నం సెక్టర్ నుంచి పెద్ద విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లత, అంగన కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ ఇంటికి తాగునీరందించడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే కూన రవికుమార్**

**-రూ.84 కోట్లతో**

**మంచినీటి పథకానికి శంకుస్థాపన**



**సరుబుజ్జిలి, ఏప్రిల్ 21(వార్త):** పురుషోత్తపురం పంచాయతీ పరిది లోని అలమాజీపేట ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద పురపాలక, పట్ట ణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆముదాలవలస పురపాలక సంఘం పరిధి లో సమగ్ర తాగునీటి సరఫరా పథకానికి శంకుస్థాపన కార్య క్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆముదాల వలస శాసనసభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తరువాత ఈ ప్రాంతంలో నీటి సమ స్యలు తగ్గి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందుతాయని ఆశా భావం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని కూడా పేర్కొన్నారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వ హించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులును ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి ముఖ్య నాయకులు, అధి కారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ప్రజా సమస్యల పరిష్కారానికే..

# ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**

**-ప్రజా పరిష్కార వేదిక నిర్వహణ**

**పలాస, ఏప్రిల్ 21 (వార్త):** ప్రజల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రజాదర్బాలను ఏర్పాటు చేశామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గ ప్రజల సమస్యలను అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారం చేసేందుకు పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన "ప్రజా పరిష్కార వేదిక -- ప్రజా దర్బార్" కార్యక్రమం అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హాజరై తమ సమస్యలను శాసనసభ్యురాలికి వినిపించారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర సమస్యలకు సంబంధించిన 22 మంది వినతిపత్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే ప్రజల వినతులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రధాన బాధ్యతని, ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వేగవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యార్థులకు అభినందనలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21(వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరి చిన విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు మంగళవారం బహుమతులు అందజేశారు. పి.లవణ, శిఖామహపాత్, జయదేవ్ బేహరా, అంజలి నాయక్, మరేషా రేణుక, రామారావుకు చిరు జ్ఞాపికతో పాటు రూ.1000ల బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీతమ్మ, సంతోష్‌కుమార్, రాజేంద్రకుమార్ త్రిపాఠి, మోహన రావు, రాధ, లోకేష్, ఈశ్వరరావు, శాంత, బృందావన్, భగ వతినాయక్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఐఐటీ ర్యాంకులు సాధించిన దానేశ్వర్, రేణుకా, కేశవ బెహారా లను సన్మానించారు.

## రేవు అంపలాంలో ఉచిత వైద్య శిబిరం

**నరసన్నపేట, ఏప్రిల్ 21 (వార్త):** పోలాకి మండలం రేవుఅంపలాం గ్రామంలో జేమ్స్ హాస్పిటల్ సహకారంతో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని, ఇలాంటి శిబిరాలు ప్రజలకు ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ మైలపిల్లి త్రినాథ్, కుంచం యోగేశ్వరరావు, రాయవలస శ్రీధర్, ఉప్పాడ అప్పలరెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమర యర్రయ్య, పోతల రామారావు, కుప్పిలి పెద్ద రమణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నరసన్నపేటలో 25న మెగా జాబ్‌మేళా

**- పాల్గొన్ననున్న 12 కంపెనీలు**

**-నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం**

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత**



**నరసన్నపేట, ఏప్రిల్ 21(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పెద్దాడ లత మంగళవారం తెలిపారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ జాబ్ మేళాలో సుమారు 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్లు ఆ సంస్థ అధికారి సాయికుమార్ వెల్లడించారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ రంగాలకు చెందిన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన

**- గోపాలపెంటలో ఉపాధ్యాయుల ప్రచారం**




**నరసన్నపేట, ఏప్రిల్ 21(వార్త):** ప్రభుత్వ పాఠశాల విధివిధానాలు, అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు నరసన్నపేట మండలం గోపాలపెంట ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ చేపట్టి అనంతరం ఉపాధి హామీ వేతనదారులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన బోధన గురించి వివరించారు. గతంలో ఉపాధ్యాయులు, గ్రామస్థుల మధ్య ఉన్న అనుబంధం ఎంతో బలంగా ఉండేదని, ప్రస్తుతం అది తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఆ సంబంధాలను మళ్లీ పునరుద్ధరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

## ప్రతి కుటుంబం స్వీయ గణన నమోదు చేసుకోవాలి

**పలాస, ఏప్రిల్ 21(వార్త):** ప్రతి కుటుంబం స్వీయ గణన నమోదు చేసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. మంగళవారం పలాస ఆర్డీవో అప్పలరాజు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిసి స్వీయ గణనపై వివరించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీయ గణనను 2027 కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు, సందర్భంగా ఆర్డివో శిరీషని మర్యాదపూర్వకంగా కలిసి వివరాలు తెలియజేశారు. ఆర్డీవోస్వీయ గణన 2027 యొక్క ముఖ్య ఉద్దేశాలు, ఈ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు, నమోదు ప్రక్రియ విధానం గురించి సమగ్రంగా వివరణ ఇచ్చారు. ప్రతి కుటుంబం తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని, ఇలా నమోదు చేసుకోవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించడానికి ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్వయంగా ప్రారంభించి, ఎన్యూమరేషన్ చేసుకొని, ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం శిరీష మాట్లాడుతూ ప్రతి పౌరుడు (ఇంటిపెద్ద )ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఇంటి వివరాలను సరిగ్గా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు స్థాయి సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , హెచ్ డి టి గిరిరాజు, ఏ ఎస్ ఓ షేక్ జాఫర్, రెవిన్యూ సిబ్బంది, ఎనివరేటర్స్, సంబందిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన నీలకంఠం



**మందస, ఏప్రిల్ 21(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మట్ల వల్లయ్య న్ని అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరక్టర్, మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ జుత్తు జగన్నాయకులు సోదరుడు జుత్తు నీలకంఠం పరామర్శించారు. మట్ల వల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన భార్య మట్ట లక్ష్మమ్మ భైరిసారంగపురం ఎంపీటీసీగా ఉన్నారు. కుమారుడు మట్ట షణ్ము ఖరావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ వల్లయ్య మరణం పార్టీకి తీరని లోటన్నారు. నాయకునిగా మంచి సేవలందించారన్నారు. వల్లయ్య కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



**మెళియాపుట్టి, ఏప్రిల్ 21(వార్త):** గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని కోసమాల పిఏసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అన్నారు. మెళియాపుట్టి మండల పరిషత్ అధ్యక్షురాలు రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వేసవి కాల దృశ్య గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత శాఖధికారులు మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం జరుగుతుందని సంబంధిత శాఖ అధికారులు సభ్యులకు తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్ల పదవీకాలం ముగియటంతో ఆయా పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పరిపాలన జరుగుతుందని ఈ పరిపాలనలో 15వ ఆర్థిక సంఘం నిధులలో కేటాయించిన నిష్పత్తికి లోబడే పారిశుద్ధ్య పనులు, త్రాగునీటి కల్పన తదితర వాటిపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించవలసి ఉంటుందన్నారు. సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలు, విద్య, వైద్యము, రక్షిత మంచినీటి, నీటిపారుదల, పంచాయతీరాజ్, వెలుగు తదితర వివిధ పద్దులపై సమావేశంలో సభ్యులు చర్చించారు. సమావేశంలో వివిధ ప్రజా సమస్యల గురించి మాట్లాడే క్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, వసుంధర ఎంపిటిసి సభ్యులు సలాన జనార్దనరావు (చిట్టి) లకు మధ్య చిన్నపాటి వాగ్వాదం జరగడంతో పోలీసులు జోక్యం చేసుకొని మండల సమావేశంలో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా ఎంపీటీసీ జనార్దనరావుకు బయటికి తీసుకునివచ్చారు. సర్వసభ్య సమావేశంలో పెద్దపద్మాపురం ఎంపీటీసీ ప్రతినిధి మండల ప్రజల తరపున తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాలలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, లో వోల్టేజ్ సమస్య వల్ల విద్యుత్ మోటర్లు కాలిపోతున్నాయని అలా జరగకుండా విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఉపాధి హామీ కూలీలకు ఎండల తీవ్రత దృష్ట్యా పని ప్రదేశంలో టార్పాలిన్ పందిళ్లు, మంచినీళ్లు, గ్లూకోజ్ ప్యాకెట్లు, అందుబాటులో ఉంచాలని, అలాగే వేతన దారులకు రావలసిన పేమెంటులను తక్షణం రిలీజ్ చేయాలని, అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రహదారులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని, కొత్తగా మంజూరు కావలసిన వికలాంగుల, వితంతు, వృద్ధాప్య పెన్షన్లను అర్హులైన వారికి అందెల చేయాలని, అర్హులైన వారికి ఇళ్ల మంజూరు చేయాలని, పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్లో సిబ్బంది కొరత ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, మండలంలో సెల్ టవర్లు నిర్మించిన గాని ఇంకా చాలా గ్రామాలకు నెట్వర్క్ సమస్య వెంటాడుతుందని దాన్ని పరిష్కరించాలని తదితర 12 అంశాలపై తీర్మానం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని పెద్ద పద్మాపురం ఎంపీటీసీ ప్రతినిధి హంసమ్మ ఋషికేష్ సభలో వినతి పత్రం అందించారు. దీనిపై పిఎసిఎస్ అధ్యక్షులు మోహన్ రావు మాట్లాడుతూ సమస్యలపై అధికారులతో చర్చించి ప్రజా సమస్యల పరిష్కరించడం జరుగుతుందని తెలియజేస్తూనే, గత ప్రభుత్వ హయాంలో జరిగే పనులకు ఇప్పుడు ప్రభుత్వంలో చేపడుతున్న అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చి అనే అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీపీ రానా ఈశ్వరమ్మతో పాటు పిఏసిఎస్ అధ్యక్షులు మోహన్ రావు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా ఇతర శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## ముసిడిగట్టు పాఠశాలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల సామర్థ్యాలపై సంతృప్తి - చేరికలు పెంచాలని సూచన



**నరసన్నపేట, ఏప్రిల్ 21 (వార్త):** ముసిడిగట్టు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఉప్పాడ శాంతారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించిన ఆయన బోధన పద్ధతులపై సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరగడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని వివరించాలని సూచించారు. అవసరమైతే తాము కూడా ఇంటింటి ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈవో పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికకు స్పెషల్ డ్రైవ్


- రావులవలసలో ఇంటింటా సర్వే నిర్వహించిన ఎంఈఓ దాలినాయుడు



**నరసన్నపేట, ఏప్రిల్ 21 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంపొందించేందుకు నరసన్నపేట మండలం రావులవలస పంచాయతీలో మంగళవారం ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ పేడాడ దాలినాయుడు గ్రామానికి చేరుకుని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటా సర్వే నిర్వహించారు. తల్లిదండ్రులను నేరుగా కలుసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సదుపాయాలు, నాణ్యమైన బోధన గురించి వివరించి, ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంలో తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఈ సందర్భంగా ఎంఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో నరసన్నపేట విద్యార్థి ప్రతిభ

- జాతీయ స్థాయిలో 444వర్యాంక్ సాధించిన రోహిత్



**నరసన్నపేట, ఏప్రిల్ 21 (వార్త):** జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఐటీ జేఈఈ మెయిన్స్ సెషన్-2 పరీక్షా ఫలితాల్లో నరసన్నపేటకు చెందిన విద్యార్థి అల్లు రోహిత్ తన ప్రతిభను చాటాడు. సోమవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో ఆయన జాతీయ స్థాయిలో 444వ ర్యాంక్ సాధించి విశేష ఫలితాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం రోహిత్ మాట్లాడుతూ తన లక్ష్యం ముంబైలోని ఐఐటీలో చదవడమేనని తెలిపారు. కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. రోహిత్ తండ్రి అల్లు లక్ష్మణరావు ఒక ప్రైవేట్ బీఈడీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తుండగా, తల్లి లలితాంబ గృహిణి. కుమారుడి విజయంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ సాధించిన ఈ విజయం స్థానికంగా అభినందనలు అందుకుంటోంది.

## ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ



**పలాస, ఏప్రిల్ 21 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులకు మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వారం రోజులపాటు నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కార్యక్రమం ఈ రోజు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 520 మందికి పైగా ప్రయాణికులు, వృద్ధులు, బాలురు, బాలికలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొని మజ్జిగను స్వీకరించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "మజ్జిగ పంచడం అంటే కేవలం దాహం తీర్చడం మాత్రమే కాదని, అది మనిషిగా ఉన్న మన మంచితనాన్ని, మనసులోని మానవతను వ్యక్తపరచే మహత్తర సేవ అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ రోజు మజ్జిగ పంపిణీకి ఆర్థిక సహాయం అందించిన లైబ్రేరియన్ బి. నరసింహులుని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. వెంకట రమణ, సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్, డాక్టర్ వై. వెంకటలక్ష్మి, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన

- జలుమూరు మోడల్ స్కూల్‌లో 16 మంది విద్యార్థుల చేరిక



**జలుమూరు, ఏప్రిల్ 21(వార్త):** జలుమూరు మోడల్ ఆదర్శ పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్‌కు మంచి స్పందన లభించిందని ఎంఈఓ మాధవరావు, హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయుడు మెండ రామారావు తెలిపారు. సోమవారం రాత్రి పాఠశాల పరిసర గ్రామాలలో ఇంటింటా సర్వే నిర్వహించి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరించడంతో తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ క్రమంలో 16 మంది విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు ముందుకు వచ్చారని వెల్లడించారు. అనంతరం పాఠశాలలో చేరిన విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా వృత్తి విద్యా కోర్సు విద్యార్థుల స్నాతకోత్సవం

-ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, టూల్ కిట్లు పంపిణీ





**జలుమూరు, ఏప్రిల్ 21 (వార్త):** కరవంజ ఏపీ మోడల్ స్కూల్‌లో వృత్తి విద్యా కోర్సు విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి 26 మంది విద్యార్థులు సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ వృత్తి విద్యా కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. ఈ విద్యార్థులు ఏప్రిల్ 3 నుండి 12 వరకు సుమారు 80 గంటల పాటు వివిధ పరిశ్రమల్లో శిక్షణ పొందారు. ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తిచేసిన వారికి పాఠశాలలో స్నాతకోత్సవం నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీషర్టు, టూల్ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ అధ్యాపకురాలు ధర్మాన రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించండి



**మందస, ఏప్రిల్ 21(వార్త):** మందస మేజరు పంచాయతీ. ఎంతో ఘన చరిత్ర ఉంది. ప్రస్తుతం సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంతంతో పాటు కొన్ని చోట్ల చెత్తా, చెదారం పేరుకుపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ముక్కు మూసుకుని, నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణానికి చెందిన కొంతమందిలో చైతన్యం కొరవడడంతో చెత్తను ఎక్కడ పడితే అక్కడనే వేస్తున్నారు. అదేవిధంగా మందస ముఖ్య కూడళ్లలోని వ్యాపారులు కూడా చెత్తను దుకాణాలకు దగ్గర్లో వేస్తున్నారు. రాజావారికోట ఆవరణలో మరీ దారుణంగా ఉంది.

ఏ రోజుకారోజు చెత్తా, చెదారాన్ని పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నప్పటికీ, కొన్ని చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రధానంగా మందస పట్టణంలో మధ్య ఏర్పాటు చేసిన డివైడర్లు కూడా కొన్ని చోట్ల చెత్తకు నిలయంగా మారింది. ఇటు ప్రజల్లో అవగాహనరాహిత్యం, అటు పంచాయతీలో నిర్లక్ష్యంతో మందసలో అపారిశుద్ధ్యం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది మందసలో కొన్ని చోట్ల ఏర్పడుతున్న పారిశుద్ధ్యం సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజలు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21(వార్త):** జనగణన లో ఇచ్ఛాపురం మండలం లో గల ప్రజలు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలని ఇచ్ఛాపురం తహసీల్దార్ వెంకట రావు కోరారు. వివిధ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను పారదర్శకంగా క్లియర్ చేస్తామన్నారు. స్వీయ-గణన ఏప్రిల్ 16 నుంచి 30 వరకు జరుగుతోందన్నారు. ప్రతీ ఇంటి నుంచి జనగణన ఉండాలన్నారు. పూర్తి వివరాలను https://se.census.gov.in/ చేసుకోవాలన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అందరికీ ఉపాధి పనులు కల్పించండి

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 21(వార్త):** జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని జడ్పీటీసీ పాల వసంత రెడ్డి, ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలో 34 పంచాయతీల్లో ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, సర్వ శిక్ష అభియాన్ కింద రూ. 35 కోట్ల 91 ఒక లక్ష 35 వేల 302 రూపాయల పనులను చేపట్టారు. పంచాయతీల వారీగా జరిగిన పనులను వివరించారు. మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో కొలతల్లో వ్యత్యాసం ఉన్నట్టులు సోషల్ ఆడిట్ బృందం గుర్తించారు.

కార్యక్రమంలో ప్రొసీడింగ్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, డ్వామా ఏపీడీ రాధా, పి.శైలజ, ఎంపీడీవో పి జయంత్ ప్రసాద్, ఎస్ఆర్పి మాధవరావు, ఏపీఓ పి.నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమ్ కుటుంబానికి పరామర్శ



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21 (వార్త):** పురుషోత్తపురం 2 వార్డు మాజీ కౌన్సిలర్ నందికి ప్రేమ్ కుమార్ ఇటీవలి గుండె పోటు తో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ కుటుంబాన్ని వైస్సార్సీపీ నియోజకవర్గ సమనవ్య కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి,సుగ్గు ప్రేమ్ కుమార్ చాట్ల తిరుపతి తదితరులు పరామర్శించారు.

## కేసుపురం అభివృద్ధికి చర్యలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 21(వార్త):** ఇచ్ఛాపురం మండల పరిషత్ అభివృద్ధి అదికారి కేసు పురం గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు అధ్యక్షత న సమువేశము జరిగిశీది.సన్యాసి పుట్టుగ గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాలని కోరారు.జల్ జీవన్ మిషన్, వీధి లైట్లు, సి సి రోడ్డు లు చిన్న గెడ్డ వంతెన లు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో దక్కత ఢిల్లీ రావు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలి



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 21 (వార్త):** బూర్జపాడు పంచాయతీలో వైస్సార్సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పంచాయతీలో పార్టీ కమిటీలు నిర్మాణం, వెరిఫికేషన్ బూత్ లెవెల్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ పై చర్చించారు.అదేవిదంగా గ్రామంలోని వివిధ సమస్యలు చర్చించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోన్నారు.ఈకార్యక్రమంలో ,సాడి. శ్యాంప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర, చల్ల దేవరాజు, నర్తు ప్రేమ్ కుమార్, దున్న గురుమూర్తి, బుడ్డ కళ్యాణ్, సంగారు లక్షణ రావు, మొగలిపూరి మోహన్ రావు, కేశవరావు, జోగారావు, దుర్గాప్రసాద్, రాజశేఖర్, ధర్మరాజు, కృష్ణారావు, తిరుపతి, సన్నీ, సోమేశ్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ కార్యాలయంలో పాడవుతున్న కరక్కాయ విత్తనాలు

### - నిర్లక్ష్యంతో వృథా అవుతున్న ప్రభుత్వ వనరులు

**సారవకోట, ఏప్రిల్ 21(వార్త):** సారవకోట, సెక్షన్ ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో నిల్వ ఉంచిన కరక్కాయ విత్తనాలు పాడైపోతున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో మొక్కల పెంపకానికి ఉపయోగించేందుకు ఈ విత్తనాలను 2017లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ విత్తనాలను సమయానికి వినియోగించకపోవడంతో ప్రస్తుతం అవి పుచ్చిపోతున్నాయి. దీంతో ప్రభుత్వ వనరులు వృథా అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సెక్షన్ ఫారెస్ట్ అధికారి (ఎస్ఎఫ్వో) ఈశ్వరరావు స్పందిస్తూ, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో విత్తనాలు చల్లేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అప్పటి అధికారులు వాటిని వినియోగించలేక పోయారని తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి వనరులను సక్రమంగా విని యోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# జల జీవన్ మిషన్‌తో సీతంపేటకు కొత్త ఊపిరి

**పలాస, ఏప్రిల్ 21 (వార్త):** పలాస నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతమవుతున్నాయి. ప్రజలకు ప్రాథమిక సదుపాయాల కల్పనలో భాగంగా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయితీ పరిధిలోని సీతంపేట గ్రామంలో జల జీవన్ మిషన్(ఇంటింటికి కొళాయి)పైపులైన్ పనులను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పనులకు శ్రీకారం చుట్టారు. ఆయనతో పాటు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పుచ్చ ఈశ్వరరావు మాట్లాడుతూ "ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు తగ్గించాలంటే శుద్ధజల సరఫరా అత్యంత అవసరం" అని తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల రూపురేఖలు మారనున్నాయన్నారు. కర్ని రమణ మాట్లాడుతూ "టీడీపీ ఎప్పుడూ అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, సీతంపేటలో ఈ పనులు పూర్తయ్యాక ప్రజలకు నిత్యం కుళాయి నీరు అందుతుంది" అని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు కూడా ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం దొరికిందని తెలిపారు. మహిళలు ప్రత్యేకంగా సంతోషం వ్యక్తం చేస్తూ, నీటి కోసం పడే కష్టాలు ఇక తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీపాన గోపి, మాజీ ఉప సర్పంచ్ సత్యం, కో-ఆప్షన్ సభ్యులు వేణుగోపాల్, శంకర్, యూజీ పురం గ్రామ టీడీపీ అధ్యక్షులు జోగారావు, ఎస్ఎంసీ



చైర్మన్ శ్రీను, టీడీపీ నాయకులు నారాయణ, మోహనరావు, తుంభ నాదం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏలకు ఫోన్ల పంపిణీ



**పలాస, ఏప్రిల్ 21 (వార్త):** పలాస నియోజకవర్గ పరిధిలోని డ్వాక్రా సంఘాల సహాయకులు (వీఓఏ) విధి నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంగళవారం పలాసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొని,142 వీఓఏలకు ఉచితంగా మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పొదుపు సంఘాల లావాదేవీలు, రికార్డుల నిర్వహణను ఆన్‌లైన్ ద్వారా వేగవంతం చేసేందుకు ఈ స్మార్ట్‌ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డిజిటల్ విధానం ద్వారా మహిళా సంఘాల పనితీరులో మరింత పారదర్శకత వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వీఓఏలు సాంకేతికతను అందిపుచ్చుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి వీఓఏలు వెన్నెముక వంటి వారని, వారికి ఆధునిక పరికరాలు అందించడం ద్వారా క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపడుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. విఏఓలు స్పందిస్తూ తమ విధి నిర్వహణ కోసం అవసరమైన ఫోన్లను అందించినందుకు వీఓఏలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గౌతు శిరీషను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పి విఠల్ రావు, మల్లా శ్రీనివాసరావు, మూడు మండలాల మండల సమాఖ్య అధికారులు, ఎపియంలు జి వరప్రసాద్, పి కూర్మారావు, కె జంబావతి పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొన్నారు.

# గో గ్రీన్ మందసకు దాతల సహకారం

### -మొక్కల పెంపకానికి ట్రీగార్డ్స్ ఏర్పాటు

**మందస, ఏప్రిల్ 21(వార్త):** మందస అభివృద్ధికి స్వచ్ఛంద సేవకులు ముందుకు వస్తున్నారు. దాతల సహకారం తోడవ్వడంతో గో గ్రీన్ మందసగా మార్చడానికి ప్రయత్నాలు ముమ్మురంగా సాగుతున్నాయి. మందస పట్టణంలో సెంటర్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేశారు. డివైడర్లలలో మొక్కలు పెంచితే బాగుంటుందన్న ఆలోచనతో.. గో గ్రీన్ మందస అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి, మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయం జంక్షన్ వరకు మొక్కలు నాటారు. దీనిలో భాగంగా ఎస్ఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. కొంతమంది స్వచ్ఛందంగా ప్రతీ రోజూ నీరు పోస్తున్నారు. మొక్కలు చుట్టూ వెదురులో చేసిన ట్రీగార్డ్స్ ఏర్పాటు చేసినప్పటికీ, వాటితో శతశాతం మంచి ఫలితాలు రావడంలేదు. దీంతో ఎస్ఎంఆర్ ఫౌండేషన్, మందస ఆధ్వర్యంలో కొన్ని ఐరన్ ట్రీగార్డ్లు తయారు చేసింది. ఇవి బాగుండడంతో గో గ్రీన్ మందస ద్వారా వీటి ప్రాధాన్యతను వివరించడంతో దాతలు ట్రీగార్డ్లు అందివ్వడానికి ముందుకు వస్తున్నారు.

ఒక్కో ట్రీగార్డ్ ధర రూ.2,200లు వ్యయం అవుతుండగా.. ఇప్పటికే ఎస్ఎంఆర్ ఫౌండేషన్ రూ.11వేలు, వ్యాపారవేత్త వడ్డి చంద్రశేఖరం రూ.11వేలుతో పాటు దాతలు స్వచ్ఛందంగా ఐరన్ ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయడానికి విరాళాలు అందిస్తున్నారు. ఎంతో మంచి సంకల్పంతో హరిత మందసకు కృషి చేస్తున్న నాయకులు, దాతలు, స్వచ్ఛందసేవకులు అభినందనీయులు. వీరంతా చేస్తున్న కృషి ఫలించితే మందస పట్టణంలో పచ్చదనంతో పాటు నీడనిచ్చే చెట్లు కూడా తయారవుతాయి. మందస ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ప్రయాణీకులకు నీడ కూడా దొరుకుతుందనడంలో సందేహమే లేదని స్థానికులు భావిస్తున్నారు.



### రోగులకు మెరుగైన వైద్యం,

## పౌష్టికాహారం అందించాలి

✻ డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు ✻ వన్‌స్టాప్ సెంటర్‌లో తనిఖీ



**శ్రీకాకుళం, ఏప్రిల్ 21(వార్త):** మానసిక అనారోగ్యం, మేధో వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తుల హక్కులను కాపాడటంలో రాజీ పడకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలోని మానసిక ఆరోగ్య కేంద్రం, వన్ స్టాప్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వార్డుల్లో తిరుగుతూ రోగులతో నేరుగా ముచ్చటించారు. వారికి అందుతున్న వైద్యం, ఆహార నాణ్యత, పరిసరాల పారిశుద్ధ్యం గురించి ఆరా తీశారు. రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ప్రవర్తన సముచితంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కొరతను గుర్తించిన హరిబాబు, తక్షణమే ఆ లోపాలను సరిదిద్దాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోగుల భద్రత, సరైన జీవన పరిస్థితులు కల్పించడం చట్టపరమైన బాధ్యత అని గుర్తు చేశారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఆయన.. నమోదవుతున్న కేసుల వివరాలను పరిశీలించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు తీరును, ఆసుపత్రిలో చేరిన కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన సదస్సుల్లో బాలలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. ప్రసన్న కుమార్, హెచ్.ఓ.డి డాక్టర్ వి. పద్మ, టి. అఖిల, డి. విజయలక్ష్మి ఇతర వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## ప్రజా సంతృప్తిలో రాష్ట్ర సగటును దాటాలి

✻ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21(వార్త):** ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజల్లో ఉండే సానుకూల దృక్పథం జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర సగటు కంటే తక్కువ ఉండకూడదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం పనితీరు మెరుగుపడటంతో పాటు, ప్రజలకు అందుతున్న సేవలపై స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మండలం, జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేందుకు అధికారులు నిరంతరం శ్రమించాలని సూచించారు. ముఖ్యంగా 'సారథి', 'వాహన్' సేవలతో పాటు ఆర్టీసీ బస్సు సర్వీసులు, బస్సు స్టేషన్ల నిర్వహణపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని తెలిపారు. రోడ్లపై గుంతల పూడిక పనులను వేగవంతం చేసి, ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'ను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పని దినాల కల్పనను పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించడంలో అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. సచివాలయాల పనితీరును మెరుగుపరిచేందుకు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని, రెవెన్యూ అంశాలైన మ్యుటేషన్లు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, కుల ధృవీకరణ పత్రాల జారీ వంటి సేవలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మండల కేంద్రాల నుంచి ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## అన్న క్యాంటీన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21(వార్త):**జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఐదు అన్న క్యాంటీన్లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అన్న క్యాంటీన్ల సీఈవో పోతుల వంశీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్న క్యాంటీన్ల అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్. కుర్మారావుతో కలిసి ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్ల పనితీరు, భోజన నాణ్యతపై నిరంతరం ప్రజాభిప్రాయాన్ని సేకరించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా క్యాంటీన్ల పరిసరాల పరిశుభ్రత విషయంలో రాజీ పడకూడదని, ప్రస్తుతం ఉన్న 83 శాతం పరిశుభ్రతను 95 శాతానికి పెంచేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. క్యాంటీన్లలో భోజనం చేసేందుకు వచ్చే సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆముదాలవలస పురపాలక కమిషనర్ టి. రవి, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, వివిధ పురపాలక సంఘాల అడ్వైజరీ కమిటీ సభ్యులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546